## క్లుప్తంగా

### హైమాస్ట్ లైట్ల బిగింపు



సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని పలుచోట్ల, బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు ఊడిపోయాయి. 'హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు కరువు' అనే శీర్షిక సాక్షిలో ఈ నెల 2న కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి రత్నాకర్ ఊడిపోయిన హైమాస్ట్ లైట్ల స్థానంలో కొత్త లైట్లు బిగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### బినామీలు టెండర్లు వేయొద్దు

హన్మకొండ: గౌడ కులస్తులకు కేటాయించిన వైన్ షాపులకు బినామీలు టెండర్లు వేయొద్దని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్ సూచించారు. ఒకవేళ బినామీలు టెండర్లు వేసి దక్కించుకుంటే ఆ షాపులు నడవకుండా అడ్డుకుంటామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు



దామెర: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. కాగా కోడ్ అమలులోకి రావడంతో అధికారుల ఆదేశాల మేరకు వివిధ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది మంగళవారం తొలగించారు. దీంతో బతుకమ్మ, దసరా సంబురాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపుతూ వివిధ పార్టీలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు తొలగిపోవడంతో గ్రామాల్లో సందడి లేకుండా పోయింది.

### ముస్లింలకు వాటా కేటాయించాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్లింలకు వాటా కేటాయించాలని మాజీ వైస్ ఎంపీపీ ఎండీ.జాకిర్ అలీ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల బీసీకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ జీఓ జారీ చేసిందని అన్నారు. కాగా అందులో ముస్లింలు 12 శాతం ఉన్నారని పేర్కొన్నారు. దామాషా ప్రకారం నిబద్ధత కలిగిన ముస్లింలకు ఆయా పార్టీలు బీసీ స్థానాల్లో అవకాశం కల్పించాలని వెల్లడించారు. ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకొని కో ఆప్షన్ పదవులకే పరిమితం చేస్తున్నట్లు వాపోయారు.

### బెల్ట్ షాపుపై పోలీసుల దాడి



మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండల కేంద్రంలో అనుమతి నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి రూ.4,400ల విలువ గల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ప్రతీ ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. ఎవరైనా రూల్స్‌కు వ్యతిరేకంగా ప్రవర్తించినట్ల తెలిస్తే చట్టపరమైన చర్యలు తప్పదని హెచ్చరించారు.

### ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి

దోర్నకల్: మండలంలోని హూన్యాతండా ఎంపీపీఎస్‌లోఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రమేశ్(61) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం బత్తినివానిపల్లెకు చెందిన రమేశ్ 46 ఏళ్ల వయసులో ఉద్యోగం సాధించి 2010 నవంబర్‌లో హూన్యాతండా పాఠశాలలో చేరాడు. రమేశ్ అక్టోబర్ 31న పదవీ విరమణ పొందాల్సి ఉంది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# ఎన్నికల కోడ్.. తస్మాత్ జాగ్రత్త

పరకాల : ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన 24 గంటలలోపు ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి రాజకీయ నాయకులైనా.. ప్రజాప్రతినిధులైనా కోడ్‌ను పాటించాల్సిందే. అయితే బతుకమ్మ..దసరా సంబురాలతో కొందరు గ్రామాల్లో కొందరు రాజకీయ నాయకులు కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. పండుగ కదా.. ఏమి కాదనుకొని మండలంలోని అనేక గ్రామాల్లో రాజకీయ నాయకులు పోటీ పడి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల సిబ్బంది ఫ్లెక్సీలతో పాటు గోడరాతలు తొలగించారు.



గ్రామాల్లో వెలిసిన రాజకీయ ఫ్లెక్సీ తొలగిస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు

**సాధారణ ప్రవర్తనా నియమావళి**

- ఏ ఒక్క రాజకీయ పార్టీ లేదా అభ్యర్థి ప్రస్తుతం నెలకొన్న విభేదాలను తీవ్రతరం చేయడం లేదా పరస్పర ద్వేషభావాన్ని సృష్టించడం చేయొద్దు.
- జాతీ, మతం, కులం, ప్రాంత ప్రాతిపదికంగా ఓటు వేయాలని కోరవద్దు
- ఎన్నికల ప్రచారానికి ప్రార్ధనా మందిరాలు, చర్చిలు, దేవాలయాల వంటి ప్రదేశాలను వాడుకోవద్దు
- ఇంటియాజమాని అనుమతి లేకుండా గోడలపై రాతలు చేయకూడదు.
- అధీకృత స్థానిక అధికారుల నుంచి అనుమతి పొందకుండా పార్టీలు కానీ అభ్యర్థి కానీ బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు చేయకూడదు.
- ఊరేగింపులకు అనుమతి తీసుకుంటే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, రోడ్డు షోలు జరుపుకోవాలి. లేనిపక్షంలో అయా ప్రచార రథాలను..ఎన్నికల అధికారులు జప్తు చేస్తారు.
- ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా ప్రచారాలు చేయకూడదు.

**నిష్పక్షపాతంగా వ్యవహరించాలి**



స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు పూర్తి గా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. పోటీ చేస్తున్న అ భ్యర్థి లేదా రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేయకూడదు. అదే విధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు కోడ్‌కు కట్టుబడి ఉండాలి.

– పెద్ది ఆంజనేయులు, ఎంపీడీఓ

## భారీ వాహనాలతో కుంగిన వంతెన

వేలేరు : మండలంలోని బండతండా శివారు తొక్కుడుబండ వద్ద ఉన్న వాగుపై కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెనపై నుంచి నిత్యం పదుల సంఖ్యలో భారీ టిప్పర్ వాహనాలు కంకర, గ్రానైట్ లోడ్‌తో ప్రయాణిస్తుంటాయి. ప్రస్తుతం వంతెన శిథిలావస్థకు చేరడం, ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు వంతెన కుంగి కూలిపోయే దశకు చేరుకుంది. మంగళవారం మధ్యాహ్న సమయంలో కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వాహనం వంతెనపైకి రాగానే ఒక్కసారిగా కుంగిపోయి భారీగుంత ఏర్పడింది. దీంతో లారీ అదుపు తప్పి పక్కనున్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. వంతెన కుంగిన సమయంలో ఎలాంటి వాహనాలు, చుట్టు పక్కల వాహనదారులు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వాగుపై కొత్త వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కుంగిపోయిన వంతెనపై అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన టిప్పర్

# బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యేలు రమేశ్, శ్రీధర్, ధర్మారావు తదితరులు

ఐనవోలు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు హనుమకొండలో బీజేపీలో చేరారు. మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు మాదాసు ప్రణయ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులకు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ కాషాయ కండువాలు కప్పి వారిని బీజేపీలోకి ఆహ్వానించారు. ప్రధానమంత్రి మోదీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. బీజేపీలో చేరిన వారిలో మద్దెన యాకరాజు, దామెరగిద్ద రాజేష్, తోట దేవేందర్, కనకస్వామి, మోహన్‌రావు, రాజు, భరత్, కృష్ణకుమార్, సంజయ్, శివాజీ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ మండల నాయకులు విక్రమ్, వెంకటేశ్, రాజేశ్, సుమన్, రవి, సంపత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం

- హనుమకొండ సర్కిల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, డీఈ సామ్యానాయక్

పరకాల: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామని విద్యుత్ శాఖ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.మధుసూదన్‌రావు, డీఈ సామ్యా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరకాల పశువుల సంతలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న సమయంలో విద్యుత్ అంతరాయంపై ఆయన స్పందించారు. విద్యుత్ సిబ్బంది స్వీయ పర్యవేక్షణలో విద్యుత్ సరఫరాను మానిటర్ చేస్తున్న క్రమంలో సాంకేతిక లోపంతో రెండు నిమిషాలు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. దీంతో వెంటనే విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై రేగొండ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామన్నారు. అయితే పట్టణంలో 10 సార్లు విద్యుత్ అంతరాయం జరిగినట్లు ప్రచారం జరుగుతుందన్న ఆయన అలా జరిగితే సబ్‌స్టేషన్ విద్యుత్ రికార్డులో నమోదు అవుతుందన్నారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు. సరఫరాలో ఎలాంటి అంతరాయం చోటు చేసుకుంటే తక్షణమే చర్యలు తీసుకోవడానికి మండల, పట్టణ ఏఈలను, లైన్‌మెన్‌లకు సమాచారం అందించాలని వినియోగదారులను కోరారు.

## బీఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ

కమలాపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల సమన్వయ కమిటీని నియమించినట్లు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ సభ్యులుగా నాయినేని తిరుపతిరావు, పేరాల సంపత్‌రావు, ఎర్రం ఇంద్రసేనారెడ్డి, మారెపెల్లి నవీన్‌కుమార్, లాండిగె లక్ష్మణ్‌రావు, తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, పింగిలి ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, సంపత్‌రావు, తిరుపతిరెడ్డి, అశోక్, కుమారస్వామి, రమేష్, నియమితులయ్యారు.

## ఈటల ఇంట్లో ఎన్నికల సందడి

కమలాపూర్ : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల ప్రకటన, ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో మంగళవారం మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంట్లో ఎన్నికల సందడి నెలకొంది. ఎంపీ కమలాపూర్‌లోని తన నివాసానికి రాగానే హుజూరాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల నుంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్న ఆశావహులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున ఈటల నివాసానికి చేరుకున్నారు. ఆశావహులతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో మండలాల వారీగా సమీక్షించిన ఈటల వారితో మాట్లాడుతూ ఈనెల 8 వరకు వేచి చూడాలని సూచించినట్లు సమాచారం.



ఎంపీ ఈటలను సన్మానిస్తున్న యాదవులు

కాగా అఖిల భారత యాదవ మహాసభ మండల కమిటీ ఆధ్వర్యంలో యాదవులు ఎంపీ ఈటలను కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. అనంతరం ఈటలను శాలువాతో సన్మానించారు.

## డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీకి సన్మానం



డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీని సన్మానిస్తున్న బొడ్డున వెంకటేశ్వర్లు, మిత్ర బృందం

హన్మకొండ: గ్రూప్ -1లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన విలాయత్ అలీని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం నాయకులు, తపాలా ఉద్యోగులు సన్మానించారు. ఐనవోలు మండలం పున్నేలు గ్రామానికి చెందిన ఎండీ.మహబూబ్ అలీ, షమీమ్ దంపతుల కుమారుడు విలాయత్ అలీ బీసీ -ఈ కేటగిరిలో రాష్ట్ర మొదటి ర్యాంక్ సాధించి మంచిర్యాల డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. వరంగల్ మండిబజార్‌లోని నివాస గృహంలో విలాయత్ అలీని తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొడ్డున వెంకటేశ్వర్లు, ఆత్మీయ మిత్ర బృందం పిట్ట రాజు, టి.కమలాకర్, ఎ.రవి ప్రసాద్, కె.పరమేశ్వర్ మంగళవారం కలిసి అభినందించారు.

## బతుకమ్మ విజేతలకు బహుమతుల అందజేత

శాయంపేట : సద్దుల బతుకమ్మలో భాగంగా బతుకమ్మను అందంగా, పెద్దగా అలంకరణ చేసిన చెన్నబోయిన సరోజనకు మొదటి బహుమతి, దాసరి సంధ్యకు రెండో బహుమతి, నాలిక విజయకు మూడో బహుమతి గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విజేతలకు పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతిలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు బలిజె నర్సింహారాములు, కాంగ్రెస్ మండల సీనియర్ నాయకులు వినుకొండ శంకరాచారి, బూర లక్ష్మీనారాయణ, మారెపల్లి కట్టయ్య, రంగుబాబు, ప్రభాకర్, మహిళలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రామపెద్దలు

## సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

న్యూశాయంపేట: శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా సదస్సు రజిత అధ్యక్షతన హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తోందని తెలిపారు. రాగుల రమేష్ మాట్లాడుతూ శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 5, 6వ తేదీల్లో కాగజ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో నాయకులు హైమావతి, జమున, శోభారాణి, రమాదేవి, యాకూబి, లీల, స్వప్న, కళావతి, శాంత పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

## నవంబర్ 3 నుంచి కార్తీక మాసోత్సవాలు



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సోదా రామకృష్ణ

పరకాల: పట్టణంలో శైవక్షేత్రంగా వర్ధిల్లుతున్న శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నవంబర్ 3 నుంచి కార్తీక మాసోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ సిద్ధమైంది. ఇప్పటికే మహారుద్రయాగ కమిటీని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మహారుద్రయాగ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకుడు సోదా రామకృష్ణను మంగళవారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయన సౌండ్ సిస్టం బహూకరించేందుకు ముందుకు రావడంతో పాటు మహారుద్రయాగ కమిటీని సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్ తోట రవి, మహారుద్రయాగ కమిటీ సభ్యులు ఎర్రం లక్ష్మణ్, పిట్ట వీరస్వామి, పంచగిరి శ్యామ్, గందె రవి పాల్గొన్నారు.

## సిద్ధధాత్రి అలంకరణలో దుర్గామాత



వేలేరు : అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి భజనమండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం దుర్గామాతను సిద్ధధాత్రి అవతారంలో అలంకరించారు. అలాగే అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి భక్తులచే కుంకుమ పూజ చేయించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

**దుర్గాదేవి అవతారంలో అమ్మవారు**

వేలేరు : మండల కేంద్రంలోని అమ్మభవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. వేలేరు మాజీ ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్-సులోచన దంపతులు ప్రత్యేక పూజలు, హోమం, నిత్య కుంకుమార్చన, నిత్యారాధన అర్చకులు సంతోష్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో పిట్టల జయమ్మ, జీడయ్య, కోమల, బొందయ్య, బాలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: పూజలో పాల్గొన్న భక్తులు

# వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

ఆత్మకూరు/శాయంపేట/దామెర : ఆత్మకూరు, శాయంపేట, దామెర మండలాల్లోని నీరుకుళ్ల, పెంచికలపేట, అగ్రంపహాడ్, అక్కంపేటతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మల్టీ పర్పస్ సిబ్బందితో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ వేడుకలను జరుపుకున్నారు.



ఆత్మకూరు : నీరుకుళ్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శాయంపేట : బతుకమ్మలతో వస్తున్న మహిళలు



దామెర : బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

## మద్యం, మాంసం విక్రయిస్తే చర్యలు

వేలేరు : అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున ఎవరైనా మద్యం, మాంసం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అజ్మీర సురేశ్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 2న దసరా పండుగతో పాటు, గాంధీ జయంతి రావడంతో జాతిపిత గాంధీ గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా మూగ జంతువులను వధించి వాటి మాంసంతో పాటు మద్యం అమ్మకాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిధిలో ఎవరైనా జీవహింస చేసినా, మద్యం అమ్మకాలు చేపట్టిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ఎస్సై సురేశ్